




# ‘బోరు’ మనాల్సిందే !

**పెద్ద మోటర్లతో భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం**

**ఒక్కో రైతుపై అదనంగా రూ.లక్ష వరకు భారం**

**కాంగ్రెస్ మాయ మాటలను నమ్మితే.. రైతుల బతుకులు ఆగమాగమే**

**కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని రేవంత్‌పై వికారాబాద్ జిల్లా రైతన్నల ఆగ్రహం**

వికారాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెసొస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవనేది ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నేతల వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతున్నది. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని, 10 హెచ్‌పీ మోటర్లతో మూడు గంటల్లో మూడెకరాలు పారుతుందని అవగాహన లేకుండా మాట్లాడుతున్న రేవంత్ వ్యాఖ్యలను బట్టి చూస్తే కాంగ్రెసొస్తే వ్యవసాయ భూములు మళ్లీ బీడు భూములు కావడం ఖాయంగా కనిపిస్తున్నది. ప్రస్తుతం బోర్లు, బావులకు వినియోగిస్తున్న 5 హెచ్‌పీ మోటర్లకు బదులు 10 హెచ్‌పీ మోటర్లను వినియోగించినట్లయితే రైతులకు, ప్రభుత్వానికి అదనపు భారం కానున్నది. 10 హెచ్‌పీ మోటర్లను కొనుగోలు చేసేందుకుగాను రూ. 2 లక్షల వరకు భారం పడనుండగా, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్నీ పెంచాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మొత్తం విద్యుత్తు వ్యవస్థనే మార్చాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఒకవేళ ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యంతో 10 హెచ్‌పీ మోటర్లను నడిపిస్తే ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయే ప్రమాదం ఉన్నది. నీటి నిల్వలు అధికంగా ఉన్న బావుల నుంచి నీటిని తోడేందుకు 10 హెచ్‌పీ మోటర్లు



పెట్టొచ్చు కానీ బోర్లకు 5 హెచ్‌పీ మోటర్లే సరిపోతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. జిల్లాలో దాదాపు బోర్ల వినియోగమే ఉన్నది కాబట్టి 5 హెచ్‌పీ మోటర్లే మేలంటున్నారు. ఆనాడు కరెంట్ కష్టాలతో బోర్లు, బావుల్లో నీరున్నా సాగు చేసుకోలేని పరిస్థితి ఉండేది. కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడొస్తదా అని ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. మళ్లీ కాంగ్రెస్‌కు అవకాశమిస్తే కరెంట్ కష్టాలు తప్పవని జిల్లా రైతాంగం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నది. మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్తు రంగంలో విప్లవాత్మక మార్పు వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే తెలంగాణ చీకటి అవుతుందని అక్కసు వెల్లగక్కిన సమైక్య పాలకుల వ్యాఖ్యలకు దీటుగా వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగానికి నిరంతర విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. నాడు కరెంట్ వస్తే వార్త.. నేడు కరెంట్ పోతే వార్త.. కనీవినీ ఎరుగని మార్పును సీఎం కేసీఆర్ తీసుకొచ్చారు. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్తు సరఫరా నిర్ణయంతో దేశంలోనే ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. మరోవైపు 10 హెచ్‌పీ మోటర్లతో 3 గంటల్లో మూడెకరాలు నీళ్లు పెట్టొచ్చన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 3 గంటల్లో ఓ మూలకు కూడా పారదని, మళ్లీ విద్యుత్తు షాక్‌లతో ఆత్మహత్యలు, అర్ధరాత్రి పొలాల పడిగాపులే తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలు..



కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలతో అవస్థలు పడ్డాం. ఎకరం, రెండు ఎకరాలు పారితే గగనంగా ఉండేది. 24 గంటల కరెంట్ ఇస్తే బోరు బావులకు 3హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లు సరిపోతయ్. 10 హెచ్‌పీ మోటర్లకు ఖర్చు ఎక్కువే.. బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉంటుంది. రేవంత్‌రెడ్డి మాటలు సరైనవి కాదు. వ్యవసాయదారుడికే ఆ కష్టం తెలుస్తది..

– సుభాన్‌రెడ్డి, నారాయణపూర్ (వికారాబాద్)

### రైతులను మోసం చేసేందుకే కుట్రలు



కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నది. 10 హెచ్‌పీ మోటర్లు బిగిస్తే బోర్లలో ఊట తగ్గుతది. మోటర్లు మోతాదుల పోస్తేనే వచ్చే ఊటను చాలా సమయం వరకు నీరు వచ్చి పొలం పారుతది. కూరగాయల పంట సాగు చేస్తుంటాం. 5 హెచ్‌పీ మోటర్ సరిపోతుంది. మూడు గంటల కరెంట్ అంటే రైతులు ఆగం కావడం ఖాయం.

– నర్సింహారెడ్డి, మైలార్‌దేవరంపల్లి (వికారాబాద్)


### కరెంట్ షాక్‌తో నాన్న చనిపోయాడు..



2009లో మా నాన్న నర్సింహారెడ్డి రాత్రి బోరు నీరు పారబెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ కోతల వల్లే ఈ ప్రమాదం జరిగింది. కాంగ్రెస్ ఎన్ని మాయమాటలు చెప్పినా నమ్మేదిలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వడంతో ఎప్పుడు పడితే అప్పుడు పంటలకు నీరు పారబెట్టుకుంటున్నాం.

– కొండారెడ్డి, మైలార్‌దేవరంపల్లి (వికారాబాద్)

### కాగ్రెస్‌తో తీరని నష్టం..



మా అన్న అనంత్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కాంగ్రెస్ హయాంలో మా అన్న కరెంట్ షాక్‌తో చనిపోయాడు. ఆ బెంగతో మా నాన్న చనిపోయాడు. వదిన మతిస్థిమితం కోల్పోయింది. కాంగ్రెస్ వల్ల మా కుటుంబమే ఆగమైంది.

– సత్యనారాయణ, ఆలంపల్లి (వికారాబాద్)

### బోర్లు ఎండి పోతయ్..



10హెచ్‌పీ మోటరు బిగిస్తే బోర్లు ఎండి పోతయ్. కాంగ్రెస్ నాయకులకు వ్యవసాయంలో బాధలు తెల్వవు. 10హెచ్‌పీ మోటర్లతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పడి పేలిపోయే ప్రమాదం ఉంది. సీఎం కేసీఆర్ పుణ్యమా అని 24గంటల కరెంట్ వస్తున్నది.

– నర్సింహులుగౌడ్, రైతు, బూర్గుల గ్రామం (షాద్‌నగర్‌టౌన్)

### 10 హెచ్‌పీ మోటర్లకు ఖర్చు ఎక్కువ..



10 హెచ్‌పీ మోటర్, పైపులకు ఖర్చు ఎక్కువ. ఓవర్ లోడ్ వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. ఉమ్మడి పాలనలో కరెంట్ కోతలతో ఇబ్బందులు పడ్డాం. తెలంగాణ సర్కార్ 24 గంటల విద్యుత్తు సరఫరా చేయడంతో కష్టాలు తీరాయి. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయ రంగంపై అవగాహన లేకపోవడంతోనే రైతులకు 3 గంటల కరెంట్ సరిపోతుందని అంటున్నారు. తెలంగాణ వచ్చాకే రైతుల దశ, దిశ మారింది.కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మనం కోరికోరి కష్టాలు తెచ్చుకున్నట్లే.

– రఘు, (షాద్‌నగర్‌రూరల్)

### రైతులంతా కేసీఆర్ వెంటే..



తెలంగాణ రాష్ట్రంలో రైతులంతా సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారు. 10 హెచ్‌పీ మోటర్‌లు బిగించాలంటే సన్నకారు రైతులకు 50 వేల నుంచి లక్ష రూపాయల ఖర్చు వస్తుంది. ఆ ఖర్చును రైతులు ఎలా భరిస్తారు. కాంగ్రెస్ హామీలను నమ్మే స్థితిలో రైతులు లేరు. తెలంగాణ ప్రభుత్వం నిరంతర విద్యుత్తును ఇస్తుండడంతో రైతుల చావులు తగ్గాయి. సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– రవీందర్ (శంకర్‌పల్లి)

### కాంగ్రెస్‌వి అమలుకాని హామీలు..



కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలోని పథకాలు అమలు కావడం కష్టం. సాధ్యం కాని హామీలిచ్చి రైతులను మోసం చేయాలని చూస్తున్నారు. వ్యవసాయానికి 3 గంటలు సరిపోతుందనడం సరికాదు. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ప్యూజ్‌లు ఎగిరిపోతయ్. దిక్కుమాలిన కాంగ్రెస్ నాయకులను పట్టించుకోవద్దు. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారు. ఆయనకు రైతులంతా మద్దతు తెలుపాలి.

– కావలి పెద్ద ఈశ్వరయ్య, రైతు, దేవునిఎర్రవల్లి గ్రామం (చేవెళ్ల రూరల్)

### కాంగ్రెస్‌వి అవగాహన లేని మాటలు..



వ్యవసాయంపై కనీస అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు కరెంట్‌పై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంట్‌తో రైతులు మందరం సంతోషంగా ఉన్నాం. మూడు గంటల కరెంట్ వ్యవసాయానికి సరిపోతుందా? పొలం పరుతుందా.. అన్న విషయాలను గ్రహించాలి. 10 హెచ్‌పీ మోటర్‌ని మా ప్రాంతంలో వాడరు.

– కడారి రామకృష్ణ, (కడ్తాల్)